


ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వేములవాడ రూరల్, నవంబర్ 16 : మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వేములవాడ ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిడ్ డే మిల్స్ జల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ, డిసెంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేసి పిల్లలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని వాపోయారు. కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చకుంటే వచ్చే నెల 10,11 తేదీల్లో టోకెన్ సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. లక్ష్మి, మానస, రాజవ్వ, దేవక్క, రజిత, భాగ్య పాల్గొన్నారు.




ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

## రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

### కలెక్టరేట్ ఎదుట బీసీ సంక్షేమ సంఘం నిరసన

జగిత్యాల, నవంబర్ 16 : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు విద్యార్థులతో కళాశాలలను బహిష్కరించి, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలను ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫీజుల బకాయిలు రూ.7,850 కోట్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రూ.5,500 నుంచి రూ.20 వేలకు పెంచి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు స్కాలర్‌షిప్‌లకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించ లేదన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే ఇవ్వాలని, రాష్ట్రంలోని గురుకులాలను అభివృద్ధి చేయాలని, లేదంటే ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామని హెచ్చరించారు. నిరసనలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బీసీ యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల వంశీ, బీసీ మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా, బీసీ సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేశ్‌కుమార్, జగిత్యాల బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బందెల మల్లయ్య, యూత్ కో ఆర్డినేటర్ హృషికేశ్, ముద్దం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర సర్వేలో 2,550 మంది ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు

# సర్వేకు పోయిన సార్లు ఎప్పుడొస్తారో..?



- ఒంటి పూట బడులతో ప్రాథమిక విద్యపై ప్రభావం!
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఎదురుచూపులు
- 18న విధుల్లో చేరాల్సి ఉన్నా.. సగం కూడా పూర్తికాని సర్వే
- నెలాఖరు వరకు కొనసాగే అవకాశం
- వచ్చే నెల 4న నాస్ టెస్ట్
- సర్వే వల్ల ఈసారి కూడా వెనుకబాటు తప్పదంటున్న టీచర్లు
- ఇలా అయితే, అకాడమిక్ క్యాలెండర్ ఎలా పూర్తి చేస్తామని ప్రశ్న

**కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రభావం పాఠశాల విద్యారంగంపై కనిపిస్తున్నది. ముఖ్యంగా ప్రాథమిక విద్య చతికిల పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఎటువంటి సెలవులూ లేకుండా పాఠశాలలు నడిచే ఈ నవంబర్‌లో ప్రైమరీ టీచర్లందరూ సర్వేలో పాల్గొనడం, ఒంటిపూట బడులు నిర్వహించడం వల్ల తల్లిదండ్రుల్లో ఒక అపనమ్మకం ఏర్పడే ప్రమాదముందనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతున్నది. నిజానికి ప్రభుత్వం ముందుగా చెప్పిన ప్రకారం ఉపాధ్యాయులు సర్వేను పూర్తి చేసి ఈ నెల 18న పాఠశాలలకు హాజరు కావాల్సి ఉన్నా.. నేటి వరకు 75 శాతం మంది సర్వే పూర్తి కాకపోవడంతో ఈ నెలాఖరు వరకు కొనసాగించే అవకాశమున్నది. ఈ సమయంలో టీచర్లు ఎప్పుడొస్తారా..? అని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉన్నది. ఇటు విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్రం వచ్చే నెల 4న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)పరీక్ష నిర్వహిస్తుండగా, సర్వే వల్ల పిల్లలను ప్రిపేర్ చేయించలేని పరిస్థితి ఎదురవుతున్నది. విద్యార్థుల ప్రతిభకు కొలమానంగా నిర్వహించే ఈ టెస్ట్‌లో ఈసారి కూడా నిరాశాజనకమైన ఫలితాలు వచ్చే అవకాశమున్నదని స్వయంగా ఉపాధ్యాయులే ఆందోళన వ్యక్తం చేస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.**



ఈ నెల 11న కోనరావుపేట మండలం మామిడిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కటుంబ సర్వే)ను ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ఇది ఈ నెల 6 నుంచి అధికారికంగా ప్రారంభమైనా.. సర్వే కోసం ఈ నెల ఒకటి నుంచే ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. నిజానికి సర్వేలో ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులను తీసుకోవద్దన్న డిమాండ్ వచ్చింది. ఈ విషయాన్ని దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో తేల్చిచెప్పాయి. అయినా, ప్రభుత్వం ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను తీసుకుంటున్నట్టు ప్రకటించింది. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు ఒంటి పూట బడులు నడుపుతామని, ఉదయం స్కూల్‌కు హాజరయ్యే టీచర్లు సాయంత్రం సర్వేలు చేస్తారని పేర్కొన్నది. ఉమ్మడి జిల్లాలో 10.84 లక్షల నివాసాలుండగా, 7,330పైగా బ్లాక్‌లుగా విభజించారు. అందుకోసం 7,480 మంది ఎన్యుమరేటర్లను వినియోగిస్తున్నారు. అందులో మెజార్టీ ఉపాధ్యాయులే ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,550 మందికి పైగా ప్రైమరీ టీచర్లు ప్రస్తుతం సర్వేలో పాల్గొంటున్నారు. వీరంతా దాదాపు ఈ నెల ఒకటి నుంచే సర్వే విధులకు హాజరవుతున్నారు. ముందుగా చెప్పిన ప్రకారం చూస్తే.. ఉపాధ్యాయులకు కేటాయించిన బ్లాక్‌లో సర్వేను ముగించుకొని, ఈ నెల 18 నుంచి పాఠశాల విధులకు హాజరు కావాల్సి ఉన్నది. కానీ, 75 శాతానికిపైగా ఉపాధ్యాయుల సర్వే పూర్తి కాలేదు. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సర్వే ప్రశ్నాపత్రాల ఫార్మాట్ పెద్దగా ఉండడం.. ఒక్కో ఫారాన్ని పూర్తి చేసేందుకు 45 నిమిషాలకుపైగా పట్టడం.. చాలా చోట్ల ప్రజలు ఎన్యుమరేటర్లకు ఎదురు ప్రశ్నలు వేయడం.. వారిని సముదాయించి సమాచారం తీసుకునేందుకు నానాపాట్లు పడడం, అలాగే ఎన్యుమరేటర్లు వెళ్లినప్పుడు ఇంటి యజమానులు లేకపోవడం.. ఉన్నవారు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల సర్వే మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తున్నదని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. ఫలితంగా సర్వేలో చాలా జాప్యం జరుగుతున్నదని, ఈ నేపథ్యంలోనే 75 శాతం మంది సర్వే పూర్తి కాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో సార్లు స్కూళ్లకు ఎప్పుడొస్తారోతెలియని పరిస్థితి ఉన్నది.

### నాస్ పరీక్షలో వెనుకబాటే?

పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్రం ఏటా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్ష నిర్వహిస్తున్నది. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్ష విద్యార్థుల ప్రతిభకు అద్దం పడుతున్నది. ఆయా పాఠ్యంశాల్లో విద్యార్థుల సామర్థ్యం ఏ మేరకు ఉందో తెలుపడంతోపాటు ఆ వివరాలను కేంద్రం వెల్లడిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే విద్యార్థుల చదువులకు ఇదో పెద్ద కొలమానం! ఈ విద్యా సంవత్సరంలో కూడా అభ్యసన సామర్థ్యాలను పరీక్షించేందుకు డిసెంబర్ 4న కేంద్రం నాస్ పరీక్షను నిర్వహిస్తున్నది. ఉమ్మడి జిల్లాలో 3, 6, 9 తరగతుల విద్యార్థులు ఈ సారి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఈ పరీక్షకు అనుగుణంగా ప్రిపేర్ చేయించాల్సిన అవసరముందని విద్యాశాఖ గతంలోనే ఆదేశించింది. ఎందుకంటే గతేడాది ఈ పరీక్షలో ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు చాలా వెనుకపడ్డారని, కనీస అభ్యాసన సామర్థ్యాలు లోపించాయని అప్పుడే విమర్శలు వచ్చాయి. ఈసారి ఆ విమర్శల నుంచి బయటపడేందుకు ఆయా పాఠశాలలు తమ కసరత్తు మొదలు పెట్టాయి. అంతలోనే సర్వే రావడంతో ఆ లక్ష్యానికి దెబ్బపడినట్టు అయింది. నిజానికి విద్యాసంవత్సరాన్ని పరిగణలోకి తీసుకొని చూస్తే ఏటా నవంబర్‌లో తరగతులు పరిపూర్ణంగా సాగుతాయి. ఎటువంటి సెలవులు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. మళ్లీ డిసెంబర్ వస్తే కొన్ని ప్రైవేట్ స్కూళ్లు క్రిస్మస్ సెలవులు ఇస్తాయి. జనవరిలో సంక్రాంతి సెలవులు వస్తాయి. అలాగే మార్చివరకు బడుల కొనసాగింపులో అనేక అవాంతరాలు వస్తూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో నవంబర్‌లో పకడ్బందీగా సాగే చదువులకు ఈ సర్వే దెబ్బకొట్టిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నాస్‌కు ఎలా ప్రిపేర్ చేయిస్తామని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు, పదిహేను నుంచి నెల రోజుల పాటు సర్వేలో ఉంటే అకాడమిక్ క్యాలెండర్ ఎలా అమలు చేయాలని అడుగుతున్నారు. వీటితోపాటు పిల్లలు లేని పాఠశాలలల పరిధిలో ఇల్లిల్లూ తిరిగి తల్లిదండ్రులకు అభయం ఇచ్చి, ప్రైవేట్‌కు వెళ్లే పిల్లలను తమ బడిలో చేర్పించుకున్నామని, ఇప్పుడు ఒంటిపూట బడులు నడుపడం వల్ల తమపై తల్లిదండ్రులు నమ్మకం కోల్పోతున్నారని, తద్వారా మళ్లీ విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశముందని కొంత మంది టీచర్లు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం వరి కోతలు, పత్తి ఏరుడు పనుల్లో తల్లిదండ్రులు బీజీగా ఉంటారని, ఈ సమయంలో విద్యార్థులు ఇంటి వద్ద ఉండడం అంత సురక్షితం కాదని, అందుకే బడులు ఎప్పుడు ఓపెన్ చేస్తారు? మీరెప్పుడొస్తారో చెప్పాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని మరికొంత మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా మధ్యాహ్నభోజనం వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

### నెలాఖరు వరకు సర్వే?

నిజానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చూస్తే చాలా పట్టణాల్లో ఇంకా స్టిక్కర్స్ అతికించే ప్రక్రియనే పూర్తి కాలేదు. ఇంకా వేలాది నివాసాలకు సిక్కరింగ్ వేయాల్సి ఉన్నది. అంతేకాదు, లక్షలాది నివాసాల్లో సర్వే చేయాల్సి ఉన్నది. ప్రధానంగా ఈ సర్వే అధికారుల అంచనాలకు భిన్నంగా కొనసాగుతున్నది. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అడుగుతున్న ప్రశ్నల్లో చాలా వాటికి కోడ్స్ వేయాల్సి ఉన్నది. వాటిని చూసి, నమోదు చేయడానికే సమయం పడుతున్నది. అలాగే 20 నుంచి 25 నిమిషాలకు ఒక ఇంటిని సర్వే చేయవచ్చని ముందుగా అధికారులు అంచనా వేశారు. కానీ, ఎన్యుమరేటర్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఒక ఇంటిని సంపూర్ణంగా సర్వే చేయాలంటే దాదాపు 45 నిమిషాలకుపైగా పడుతున్నదని చెబుతున్నారు. అదికూడా యజమానికి అన్ని రకాలుగా సహకరిస్తేనే సాధ్యమవుతుందని, లేదంటే ఇంకా అదనపు సమయం పడుతున్నదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సర్వే ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈనెలాఖరు వరకు సమయం పట్టే అవకాశమున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రాథమిక ఉపాధ్యాయులను విధుల నుంచి తప్పిస్తుందా..? లేక సర్వే పూర్తయ్యే వరకు కొనసాగిస్తుందా..? అన్నదానిపై ప్రస్తుతం ఉపాధ్యాయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఒక బ్లాక్‌లో సర్వే పూర్తి కాకుండా మధ్యలోనే నిలిపేస్తే కొత్త ఎన్యుమరేటర్ల వల్ల తప్పులు జరిగే అవకాశాలున్నాయని, అందుకే ఉపాధ్యాయులైనా లేదా ఇతర సిబ్బందైనా సర్వే కేటాయించిన బ్లాక్‌ల్లో సర్వే పూర్తయ్యేవరకు వారినే కొనసాగించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మెజార్టీ ఉపాధ్యాయులు ఈ నెలాఖరు వరకు తమ సర్వేను కొనసాగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని, ఈ ప్రభావం విద్యార్థులపై కచ్చితంగా ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే భూ నిర్వాసితులు

## సమస్యలు పరిష్కరించండి

వేములవాడ, నవంబర్ 16 : వేములవాడ పట్టణ పరిధిలోని రైల్వే భూ నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్ల మాస్కులు ధరించి శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో నిరసన తెలిపిన అనంతరం, రైల్వే భూ నిర్వాసితుడు, కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసమే తాము భూములు ఇస్తామని ముందుకు వచ్చామని తెలిపారు. మొదటిసారిగా రాజన్న ఆలయానికి అభివృద్ధి కోసం వస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. రైల్వే లైన్ కోసం ఇప్పటికే శివారు భూములు సేకరించారని, తమ భూముల విషయంలోనే ఎలాంటి స్పష్టతా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి సమస్యను విన్నవించామని, కానీ సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. తాము సీఎంకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతామని తెలిపారు. ఇందులో భాగంగానే నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కూడా తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ నిరసనలో కూరగాయల తిరుపతి, లింగంపల్లి పోచయ్య, దేవయ్య, శంకర్ ఉన్నారు.




కాటన్ వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న పవర్‌లూం యజమానులు

## కాటన్ వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పవర్‌లూం యజమానులు నిరసన తెలిపారు. శనివారం సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో చేనేత జౌళీశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తిదారులు, ఆసాములతో సమీక్షా సమావేశం నిర్వహించి, వస్త్ర పరిశ్రమకు ఇస్తున్న ఆర్డర్ల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా పవర్‌లూం యజమానులు ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలిస్టర్ వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యత ఇస్తున్నట్టుగానే కాటన్ వస్త్ర పరిశ్రమను ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శైలజారామయ్యార్‌కు వినతి పత్రం సమర్పించారు.

- సర్కారు సంస్థలో ప్యాడీ సీడ్ అంతంతే
- యాసంగికి అవసరం 75వేల క్వింటాళ్లు.. అందుబాటులో ఉన్నది 3వేల క్వింటాళ్లే
- బయటి మార్కెట్‌తో పోలిస్తే ప్రభుత్వ దుకాణాల్లో రేటూ ఎక్కువే
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రైతులు
- రైతు భరోసా జాడ లేదు.. కనీసం విత్తనాలు, ఎరువులకైనా సబ్సిడీ ఇవ్వాలని వేడుకోలు

# విత్తన కొరత.. అధిక ధర





*రైతన్నకు విత్తనపోటు తగులుతున్నది. కర్షకుడి సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న కాంగ్రెస్ విధానాలతో నడ్డి విరుగుతున్నది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ శాఖ పరిధిలో ఓ వైపు యాసంగికి వరి విత్తనాల కొరత వేధిస్తుండగా, మరోవైపు అధిక రేటుకు విక్రయిస్తుండడం భారంగా మారుతున్నది. జగిత్యాల జిల్లాలో యాసంగికి 75వేల క్వింటాళ్లు అవసరం కాగా, టీజీఎస్‌డీసీలో ప్రస్తుతం 3వేల క్వింటాళ్లే అందుబాటులో ఉన్నది. బయట మార్కెట్‌తో పోలిస్తే 25 కిలోల బ్యాగును ₹100 అదనంగా దొడ్డురకం (ధర ₹995), సన్న రకం (ధర ₹1,005)కు విక్రయిస్తుండగా, రైతాంగం ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. రెండు సీజన్ల నుంచి రైతు భరోసా ఎట్లాగు ఇవ్వడం లేదని, కనీసం యాసంగి పంటలో విత్తనాలకు, ఎరువుల కన్నా సబ్సిడీ ఇచ్చి పుణ్యం కట్టుకుంటే బాగుంటుందని కోరుతున్నది.*

జగిత్యాల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'రెండు సీజన్ల నుంచి సర్కారు రైతు భరోసా ఎట్లాగు ఇవ్వడం లేదు. కనీసం యాసంగి పంటలో విత్తనాలు, ఎరువుల కన్నా సబ్సిడీ ఇచ్చి పుణ్యం కట్టుకుంటే బాగుండేది. కానీ, అది జరగడం లేదు. వరి విత్తనాల కోసం సర్కారు సంస్థ అయిన టీజీఎస్‌డీసీ వద్దకు వెళితే బయట మార్కెట్ కంటే ఎక్కువ ధర పెట్టుడు అయితంది. ధర పెట్టినా, విత్తనాలు లేవనే అంటుండ్రు. ఇదేం కథనో అర్థం కావడం లేదు' అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పంట సాగుకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం క్రమంగా విఫలం చెందుతున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. లక్షలాది ఎకరాల్లో పంట సాగు చేసేందుకు సిద్ధమవుతుంటే తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎస్‌డీసీ) కనీసం విత్తనాలు అందించే పరిస్థితిలో లేకపోవడంపై వారు పెదవి విరుస్తున్నారు.

### యాసంగికి 3.50 లక్షల ఎకరాల్లో సేద్యం

వ్యవసాయానికి పెట్టింది పేరుగా నిలుస్తున్న జగిత్యాల జిల్లాలో ఈ యాసంగిలో పెద్ద విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వానకాలంలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఈ యాసంగి సీజన్‌లోనూ అదే రీతిలో సాగు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వానకాలంలో 3.16 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ యాసంగిలో 3 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. 27వేల ఎకరాల్లో మక్క, 22 వేల ఎకరాల్లో నువ్వు పంటను ప్రధానంగా సాగు చేసే అవకాశాలున్నాయని ప్రణాళికలు రూపొందించారు. వానకాలంలో స్థూలంగా 3.16 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, అందులో 85వేల ఎకరాల్లో సన్నరకాలను సాగు చేశారు. మిగిలిన 2.40 లక్షల ఎకరాల్లో దొడ్డురకం వరి సాగైంది. సహజంగా వానకాలంలో వరి అధికంగా సాగు చేసే రైతులు, యాసంగిలో ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతారు. అయితే జగిత్యాల జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి ఉన్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిండు కుండలా ఉండడం, వరదకాలువ సౌకర్యం ఏర్పాటు కావడం, జిల్లాలో ఉన్న వెయ్యికి పైగా ఉన్న చెరువుల్లో 75 శాతం చెరువులు పూర్తి నీటి సామర్థ్యాన్ని కలిగి ఉండడం, విస్తారంగా కురిసిన వర్షాల నేపథ్యంలో భూగర్భజలాలు విపరీతంగా పెరగడంతో యాసంగిలో 3.03 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

### ఇటు కొరత.. అటు ధరలు అధికం

జిల్లాలో లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతుండగా, రైతులకు విత్తనాలు సరఫరా చేసే విత్తనాభివృద్ధి సంస్థ జగిత్యాల విభాగంలో మాత్రం వరి సీడ్ కొరత తీవ్రంగా కనిపిస్తున్నది. వానకాలంలో సన్నరకం వడ్లను గణనీయంగా సాగు చేసిన రైతన్నలు, యాసంగిలో మాత్రం దాదాపు 95 శాతం విస్తీర్ణంలో దొడ్డురకాలను సాగు చేసేందుకే సిద్ధపడుతున్నట్టు వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో దొడ్డురకాలకు చెందిన విత్తనాలు అందుబాటులో ఉంచాల్సిన అవసరమున్నది. అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో యాసంగిలో 75,750 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం అవుతాయి. ప్రస్తుతం యాసంగి సీజన్ మొదలైన నేపథ్యంలో టీజీఎస్‌డీసీ పరిధిలో వరి విత్తనాలు అతి తక్కువగా ఉండడం గమనార్హం. తెలంగాణ సీడ్స్ శాఖ పరిధిలో ఎంటీయూ 1010 రకానికి చెందిన విత్తనాలు 1858.25 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. జేజీఎల్ 24423 రకానికి చెందిన 168 క్వింటాళ్లు, కేఎన్ఎం 1638 సన్నరకం విత్తనాలు 244.50 క్వింటాళ్లు, పీఎన్ఆర్ 29325 క్వింటాళ్లు ఉన్నాయి. మొత్తంగా 2,658.75 క్వింటాళ్ల విత్తనాలు టీజీఎస్‌డీసీ పరిధిలో అందుబాటులో ఉన్నాయి. కావాల్సినవి 75వేల క్వింటాళ్లకు పైన కాగా, ఉన్నవి మాత్రం 3వేల క్వింటాళ్లే. విత్తనాల ధర విషయంలో ప్రభుత్వ రంగ సంస్థలో ప్రైవేట్ కంటే అధిక ధరకు విత్తనాలను విక్రయిస్తుండడం గమనార్హం. తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ సహకార సంఘాలు, ఆగ్రోస్ ద్వారా రైతులకు వరి విత్తనాలను విక్రయిస్తూ వస్తున్నది. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ 25 కిలోల దొడ్డురకం విత్తనాల సంచికి ₹995కు, సన్న రకం ₹1,005కు విక్రయిస్తున్నది. బయట మార్కెట్‌లో ప్రైవేట్ కంపెనీలు ఇవే విత్తనాలను వంద రూపాయలు తక్కువకే దొడ్డ రకం ₹895, సన్న రకం ₹905కు విక్రయిస్తున్నారు. ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ రంగ సంస్థలో అధిక ధర ఉండడంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రైవేట్ కంపెనీలే దిక్కు

జిల్లా రైతులు వరి విత్తనాల కోసం ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాకు 75వేల క్వింటాళ్లకు పైగా వరి విత్తనాలు అవసరం ఉండగా, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వద్ద 3వేల క్వింటాళ్ల లోపు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 72వేల క్వింటాళ్లకు పైగా వరి విత్తనాలను రైతులు ప్రైవేట్ కంపెనీల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా రైతులు వరి విత్తనాల కోసం ప్రైవేట్ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. లక్ష్మీపూర్ లాంటి గ్రామాల్లో విత్తనం నుంచి విత్తనం కార్యక్రమం ద్వారా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే రైతు నుంచి రైతుకు విత్తనాలు అందే పరిస్థితి తక్కువగానే కనిపిస్తున్నది. రైతులు విత్తనాల కోసం ప్రైవేట్ కంపెనీదారులపైనే ఆధారపడుతుండగా, వారు సైతం రైతులకు అవసరమైన మేర సీడ్‌ను అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వ రంగ సంస్థల నుంచి విత్తనాలు రైతులకు అందజేసే పరిస్థితి లేకపోవడంతో, ప్రైవేట్ కంపెనీలు విత్తనాల ధరను పెంచే అవకాశం ఉందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

### విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇస్తే మేలు

'ఎన్నికలకు ముందు రైతును రాజును చేస్తాం. ఏటా ఎకరానికి ₹15వేల రైతు భరోసా ఇస్తాం. రైతు కూలీలకు ₹12వేల నగదు ప్రోత్సాహం ఇస్తాం. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తాం' అంటూ వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నింటికి తిలోదకాలు ఇచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలు అవుతున్నా, ఇప్పటివరకు రైతు భరోసా ఇస్తారా..? ఇవ్వరా..? అన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కనీసం ప్రభుత్వం వరితో పాటు, ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలపైన కనీసం నలభై, యాభై శాతం రాయితీ ఇస్తే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. అలాగే పంటకు వినియోగించే ఎరువుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయని, వాటిపై సైతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే కొంత ప్రయోజనం చేకూరేదంటున్నారు. రైతు భరోసా ఇచ్చే వరకైనా, సబ్సిడీ ఇవ్వాలంటున్నారు. ప్రైవేట్ కంపెనీలు ఎలాగైతే రైతులతో ఒప్పందం కుదుర్చుకొని మద్దతు ధరకు అధిక ధరను ఇస్తూ విత్తనాలను అభివృద్ధి చేసే విధంగా పంటలు పండిస్తున్నాయో..? అలాగే తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సైతం రైతులతో ఒప్పందం కదుర్చుకుంటే జిల్లాకే కాదు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి విత్తనాలను సకాలంలో, సరసమైన ధరకు అందించేందుకు అవసరమైన బలాన్ని పుంజుకుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.